# సిగపూవు

**ఐతా చంద్రయ్య**

***"డాకులూ! నీకుత్తరమొచ్చిందిరా!" పాన్‌షాప్ పిలుపు.***


***సూర్యోదయమప్పుడు పనిలోకెళ్లి రోజంతా తవ్వరి వంజేసి సూర్యాస్తమయమప్పుడు తిరిగొస్తున్న డాకయ్య కాళ్లకు బ్రేకులు పడినై. సొంత పాన్‌షాప్ మీదున్న వెంకటేశ్వర్లును వింతగా చూస్తూ-***

"పో బావా! గిప్పుడు గూడా వరాష్కమేనా?" ముందుకు నడవబోయాడు డాకయ్య.

"అరెరే పరాష్కంగాదురా!"

డాకయ్య కదలలేదు. చూపుల్లో అనుమానం.

"నాతోడు... మీ అక్కతోడు ఉత్తరమొచ్చింది డాకులూ!" గల్లాపెట్టె పక్కనున్న ఇన్‌లాండ్ లెటర్ గాల్లో



రెపరెపలాడింది.

డాకయ్య ఉరికొచ్చిండు. ఉత్తరమందుకుని అడ్రసు చూసిండు...

"డాకయ్య అంకంపేటవార్, కేరాఫ్ శ్రీ వెంకటేశ్వర పాన్‌షాప్" ఉత్తరం తనదే. కళ్లల్లో మెరుపు. "నువు పరాష్కమాడుతున్నవనుకున్న బావా!" ఉత్తరాన్ని జేబు మింగేసింది.

శ్రీ వెంకటేశ్వర పాన్‌షాప్ బిజీ సెంటరు. అటు గిరాకులకు పాన్, సిగరెట్లు అందిస్తూ ఇటు 'డాకులూ' అని పిలుచుకునే డాకయ్యతో మాటామంతి.

గ్రేటర్ ముంబై... మెగాసిటీ శివారు ప్రాంతం. చెడిపోయిన వాటర్ సప్లై పైపులు, డ్రైనేజి పైపులు, పనికిరాని రైలు డబ్బాలు... వాటికితోడుగా చిన్నచిన్న గుడిశెలు... అన్నీ కలిపి వందలు దాటి వేలల్లోకొచ్చినై. అవన్నీ అతుకుల బతుకుల మానవ నివాసాలు. రెక్కాడితేగాని డొక్కాడని శ్రామిక కేంద్రాలు.

ఒడిలోంచి కృష్ణా గోదావరులు నవ్వులు రువ్వుతూ పరుగులు తీస్తున్నా, ప్రాజెక్టులకు నోచుకోక తాగునీరు, సాగునీరు కరువై తల్లడిల్లుతున్న కోట్లాది ప్రజల కన్నీరు తుడవలేని తెలంగాణ తల్లి... బతుకుదెరువుకోసం కన్న బిడ్డల్ని కడుదూర ప్రాంతాలకు పంపిస్తూంది. కరువు కాటకాలు తిష్టవేసుక్కూచున్న తెలంగాణా నోదిలి పొట్ట చేత పట్టుకుని కోటి ఆశలతో ముంబై చేరిన రోజువారీ కూలీలతో, పనికోసం కళ్లల్లో వత్తులేసుకుని అరుగుల మీద కాలం వెళ్లబుచ్చుతున్న నిరుద్యోగులతో నిండుగా ఉంటుందా ఏరియా. అక్కడే కాపురాలు, అక్కడే పిల్లాపావలు... తెలంగాణా వాసుల శాశ్వత నిర్వాసిత ప్రాంతం.

అనాటి మెతుకుసీమ నేడు మెదకు జిల్లా. ఇతర తెలంగాణా జిల్లాలతోపాటు మెదకును గూడా మెతకదనం ఆవహించింది. ఆ జిల్లాలో మారుమూల పల్లెటూరు అంకంపేట... స్వాతంత్ర్య ఫలాన్ని రుచిచూడలేదింకా. పాడిపంటలకు కరువులేని రోజుల్లో రజాకార్ల రాక్షస కృత్యాలననుభవించింది. నైజాం రాజ్యం స్వాతంత్ర్య భారత్‌లో విలీనమయాక ప్రకృతి పగబట్టింది. బావులు, చెరువులు, కుంటల్లోంచి మాయమైనీరు కళ్ళల్లో కాపురముంటుంది. వినోదాలకు దూరమై విప్లవాగ్నికి దగ్గరైంది. రాత్రంతా అన్నల సతాయింపులు, వగలంతా పోలీసుల ఆగడాలు... దినదినగండంగా తయారైంది.

పక్క ఊరి దోస్త్ సాయంతో ముంబై చేరిన డాకయ్యకు దోస్త్ గుడిశెనే ఆశ్రయమిచ్చింది. దోస్త్ పంజేస్తున్న మేస్త్రీ ముఠాలోనే పనిదొరికింది. కాని... పని దొరికిన సంతోషం ఎంతోకాలం నిలువలేదు. అర్ధనగ్నంగా... వంపులు తిరిగిన వయసుపిల్ల సినిమా పోస్టర్లు ఆదమరిచి చూస్తూ క్రేన్ కిందపడి దోస్త్ నలిగిపోయిండు. హాస్పటల్ మంచమ్మీద డాకయ్య చేతిలో చెయ్యేసి మాట్లాడుతూనే ప్రాణాలొదిలేసిండు. డాకయ్య గుండెల్లో చిచ్చుబెట్టిండు. అతని కెవ్వరూ లేరట. కాంట్రాక్టర్ ఖర్చులతో అంత్యక్రియలైపోయినై. దోస్త్ దేహం చితిమంటల్లో చిటపటలాడ్తుంటే డాకయ్యకు... కాళ్లకింది నేల కరిగిపోతున్నట్టు, అగాధంలో కొట్టుకుపోతున్నట్టనిపించింది. ఎడారిలో ఒంటరి పక్షినయానని ఏడుస్తుంటే పాన్‌షాప్ వెంకటేశ్వర్లు వచ్చి-

"డాకులూ! ఏడిస్తే ఏంలాభం చెప్పు? ఇల్లూ ముంగిలి ఇడిచిపెట్టి వచ్చింది ఇందుకేనా?" ఆత్మీయంగా పలకరించిండు. "చావుబతుకులు మన చేతుల్లో లేవుగదా! వానికీ భూమ్మీద గింజలైపోయినై. నువ్వదంతా మరిచిపో. కష్టపడి పంజేసుకో. నాలుగు పైసలు కూడవెట్టుకుని ఇంటికివో..." అని ధైర్యం నూరి పోసిండు.

వెంకటేశ్వర్లుది మహబూబ్ జిల్లాలో ఓ పల్లెటూరట. తల్లిదండ్రుల్ని ఆకలిమంటలు మింగేసిం తర్వాత ఎక్కడెవరూ దిక్కులేకే బొంబాయి కొచ్చిండట. వచ్చిన కొత్తలో కూలిపంజేసిండట. కూలి డబ్బుల్లోంచి కొంత కూడబెట్టి పాన్‌షాప్ ప్రారంభించిండట. అరుగుమీద వందరూపాయలతో షురువైన పాన్‌షాప్... ఇప్పుడు వేల రూపాయల సరుకులతో పక్కా దుకాణమైంది. భార్య, ఇద్దరు పిల్లలు. తెలుగు కూలీలందరితో వరుసలు కలిపి మాట్లాడ్తాడు. ఎంతోమందికి అతని పాన్‌షాపే కేరాఫ్ అడ్రసు.

** ** **

"చిరంజీవి డాకులును దీవిస్తూ మీ అమ్మ రాయించునది- బాగున్నవా! ఇక్కడ నేను, మీ తమ్ముడు, చెల్లె అంతా బాగున్నం. నువ్వు బొంబాయి పోయెటప్పుడు గాడిఖర్చుల కోసం నా బంగారం, రాళ్ల సిగపూవును కుదువబెడ్తివిగదా! దాన్ని ఇడిపించుకోకపోతే షావుకారు అమ్ముతనంటున్నడు.

ఆర్నెల్ల లోపల ఇడిపిస్తమంటిమి. రెండేండ్లు గడిచిపాయె. ఎన్ని కష్టాలల్ల వున్నా, తిండికి లేకపోయినా, ఉపవాసాలున్నప్పుడు గూడా దాన్ని ఇడువలేదు. నువ్వు ఎన్ని పైసలు కూడవెట్టినవో ఎప్పుడొస్తవో తెల్వకపాయె. నువ్వు నెలనెల పంపిన పైసల్తోని కాలం గడుపుతున్నం. తమ్ముడు మంచిగ సదూకుంటున్నడు. చెల్లె పెద్దమనిషై ఐదారేండ్లాయె. దానికి పెండ్లిజెయ్యాలె. కూలి దొరికినప్పుడు పోదామంటె నాకు చాతగాదు. చెల్లె బీడీలు చేసుడు•నేర్చుకుంటుంది. మీ నాయిన బతికుంటే మంచిగుండేది.

గా సిగపూవు మా అమ్మమ్మకు వాల్లమ్మ ఇచ్చిందట. అమ్మమ్మ మా అమ్మకిచ్చింది. మా అమ్మ నాకిచ్చింది. పెండ్లిల దాన్ని నేను నీ చెల్లెకియ్యాలె. అది సొక్కం బంగారముది. ఆసొంటి మెరుపు రంగులరాళ్లు ఇప్పుడు దొరకవట. నువ్వు సరిగా తినాలె. ఆరోగ్యం మంచిగుంచుకోవాలె. మరి గా సిగపూవును ఇడిపించుకుందామా, అమ్మెయ్యమందామా? ఏ సంగతి తెలుపగలవు... ఇట్లు... మీ అమ్మ.

డాకయ్య మనసు బాధగా మూలిగింది. అమ్మ, చెల్లె, తమ్ముడు కండ్లల్ల తిరిగింద్రు. కండ్లు చెమ్మగిల్లినై.

తమ్ముని చేతిరాత అది. వాని తలరాత ఎట్లుందో! చెల్లె పెండ్లి జెయ్యాలంటే మాటలా, పోరగాండ్ల ఆటలా? తరతరాల నుండి అమ్మ చేతికొచ్చిన సిగపూవు ఆగమైపోవద్దు. అది చెల్లెకే చెందాలె. దాన్ని అమ్మితే అమ్మా, చెల్లె ఏడ్చిపోతరు. ఇడిపించి తీరాలె... నెలనెలా గుడిశె కిరాయి, కరెంటు బుగ్గ కిరాయి కట్టాలె. మున్సిపాల్టి మానుషులకు మామూలియ్యాలె. బజారు నల్లకు నెలకింత కట్టకుంటే నీళ్లియ్యరు. దీంతల్లి ముండపొయ్యా... పట్నాలల్ల పైసలు బుక్కుకుంట బతకాలె... పాలు పెరుగు కొంటే అదో ఖర్చు. రెండుపూటల అన్నందింటే డబుల్ ఖర్చు. పైసలు మిగలవు. అందుకే రోజుకో పూట భోజకం, రాత్రికి పేలాలో, అటుకులో, దోసకాయనో... దేంతోనన్నా కడుపు నింపుకునుడు అలవాటైంది. పనిమీదున్నప్పుడు మేస్త్రి మధ్యాహ్నం చాయ్ ఇప్పిస్తున్నడు. అదీ నయమే.

"ఏంది అందగాడా... గట్లున్నవ్?"

వీపు గోడకానించి కాళ్లు బార్లాచాపి శూన్యంలోకి చూస్తున్న డాకయ్య ముందు ఇందిర ప్రత్యక్షమైంది. లైటువేసింది. గుండ్రని ముఖం, పొడువు ముక్కు, పెద్దపెద్ద కండ్లు, వోణీలో దాగమంటున్న వయసు పొంగులు... చక్కని చుక్క గజ్జెల గుర్రమోలె వచ్చి ఎదురుగ కూచుంది. కండ్లు తుడుచుకున్నడు.

"ఏందబ్బా... ఏమైంది?" చేతులున్న ఉత్తరం తీసుకుని చదువుతుంది.

ఇందిర వెంకటేశ్వర్లు చిన్నాన్న కూతురట. వాళ్లూర్లె పని దొరకక, పస్తులుండలేక ఇటొచ్చింద్రంట. వాళ్ల నాయిన రోగిష్టిమనిషట. అమ్మకు మూన్నాల్లు ఇండ్లల్ల

పనిదొరికిందట. వాళ్ల మంచీచెడు వెంకటేశ్వర్లే చూస్తుండట. మొదటిసారి వచ్చినప్పుడు చెప్పింది. అప్పుడప్పుడు వచ్చి పలకరించి పోతుంది. గలగల మాట్లాడ్తుంది. కిలకిల నవ్వుతుంది, దగ్గరి చుట్టమోలె మెదుల్తుంది. కష్టసుఖాలు తెలుసుకుంటుంది. గతవారం రోజులల్ల ఇంకా దగ్గరైంది. తన సంగతులన్నీ ఇందిరకు చెప్తూంటే నెత్తిమీది నుంచి బోలెడంత బరువు దించుకున్నట్టనిపిస్తుంది.

"గదా సంగతీ! ఉత్తరం చదివి ఉత్తగ కూచున్నవా?" చెంపమీద చిటికేసి వోణీతో నుదురు అద్దింది. చిన్నపిల్లవాణ్ని కన్నతల్లి బుజ్జగిస్తున్నట్టు అమ్మ, చెల్లె, తమ్ముడు మనసుల దిరుగుతున్నరా!" కళ్లూ, ఒళ్లు తిప్పుతూ అడిగింది. "లే బుజ్జీ!" అని చెయ్యందుకుని ముసిముసిన వ్వులు నవ్వింది. ఒంపుసొంపుల ఒంటి కదలిక తన ఎదలో గిలిగింతలు పెట్టింది. గాజుల గలగల గుండెలల్ల గుసగుసలు రేపింది.

"ఓర్నియవ్వ! నా పరేషాన్ల నేనుంటే నీకు నవ్వులాటగుందా? మూతిముడిసేసుకుపోయింది. మీసంకట్టు కింది పెదవి కానింది.

"పరేషానెందుకు పిచ్చినాయినా? నువ్వొచ్చిన్నుంచి కూడవెట్టిన పైసల్తోని సిగపూవు ఇడిపించుకుని చెల్లె పెండ్లి చెయ్యరాదా! మీ చెల్లె పెండ్లయిన తర్వాత... చూపులు నిలబడిపోయినై. పెదవులు వణుకుతున్నై. పున్నమి వెన్నెల... పూదోటలో ఇందిరతో తిరుగుతూ పిల్లనగ్రోవి పాట విన్నట్టనిపించింది డాకయ్యకు.

"ఆ తర్వాత ఏంది ఇందిరా...!" గాజుల చెయ్యందుకోబోయి గబుక్కున వెనక్కు లాక్కున్నడు.

"గట్లెందుకూ? నా చెయ్యి పట్టుకుంటే వద్దన్ననా?" ఓరచూపుతో డాకయ్య చేతులందుకుని చెంపలకు రాసుకుంది.

అహహా... ఓహోహో! కొండమీద కోడెనాగు పాకుతున్నట్టు... నరాల్లో ఏదో జర్రుజర్రుమంటుంది. ఎన్నడూ అనుభవానికి రాని కమ్మని అనుభూతి.

"నీకు పెండ్లి కాలేదుగదా ఇందిరా!" గొంతు... తడారిపోతుంది.

"అవును. నీగ్గూడా కాలేదుగదా!" మాటకాదది. మిఠాయిమూట.

"ఊహుం!" ఫరవాలేదు. ధైర్యమొచ్చింది.

"బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా పనికిరావంటరు తెల్సా!" చూపులు గుచ్చుకుంటున్నె.

"నిజమే. మరెట్లా!" అడుగు ముందుకుపడింది.

"గందుకే... మీ చెల్లె పెండ్లితోని మన పె...పె...ప్పెండ్లి..." అరచేతులతో మొహం దాచుకుంది. ఒంటినిండా చక్కిలిగింత పెట్టినట్లుందతనికి.

వామ్మో... ఇందిర హుషారు పిల్లనే... నిజంగానా!" మొహమ్మీంచి చేతులు తొలగించి కళ్లలోకి చూసిండు.

అరవిరిసిన ముద్దమందారమ్మీది తేనెటీగల రెక్కల్లా... ఇందిర కనురెప్పలు టపటపలాడినై. వోణీ కొంగుతో మొహం కప్పుకుంది. తొలగించబోయాడు... దిగ్గునలేచి తుర్రుమంది.

అరెరే... ఇందిర ఇక్కడనే ఉంటే బాగుండేది... ప్చ్...

** ** **

రోజంతా పంజేసి అలసివచ్చిండు డాకయ్య గుడిసె వెనకనుండి ఏదో లొల్లి వినబుడుతుంది. గుడిసె తాళం తియ్యాలన్పించలేదు. ఆటోమేటిగ్గా కాళ్లు అటువైపు లాక్కెళ్లినై.

సిమెంటు పైపుల సంసారం చేస్తున్న గాలయ్య బయట కూచున్నడు. లబలబలాడుతూ నెత్తికొట్టుకుంటున్నడు. చుట్టూ జనాలు... అయ్యోఅయ్యో అంటున్నరు.

ఇద్దరు మున్సిపల్ వర్కర్లు గాలయ్య భార్య... నిండు చూలాలును బయటికి గుంజుకొస్తున్నరు.

అయ్యోపాపం! బలవంతంగా పైపు ఖాళీ చేస్తున్నరేమో! కాని... అంత అన్యాయమా! ఎవ్వరూ అడ్డుకోవడంలేదు. బొమ్మలోలె నిల్చుండి తమాష! చూస్తున్నరు. డాకయ్యకి ఆవేశం ముంచుకొస్తుంది.


"పాపం! గతిలేకున్నా సుతితోని సంసారం జేసుకున్నరు" పక్కనున్న ముసలాయనన్నడు.

"ఇదన్యాయం. గిట్లా జులుంజెయ్యొద్దు..." అని గట్టిగా అరవాలన్పించింది. అనువుగానిచోట అధికుల మనరాదు... పద్యం గుర్తుకొచ్చింది. "ఏమైందమ్మా!" ఓ ఆడమనిషినడిగిండు. ఆమె గొల్లుమంది.

"పోరి ముత్యమోలె ఉండె. ఏరికోరి గాలయ్యను చేసుకుంది. నొప్పులొస్తుంటే గోజలెక్క ఒర్రింది. దావకాన్లకు వోదామంటే పైసల్లేకపాయె. పొద్దట్నుంచి ఒకరే ఒర్రుడు... పిండం అడ్డం తిరిగిందటా. పోరి పాణాలు దీసింది దేవుడా.." శోకాలు దీసింది.

అయ్యో పాపం! చచ్చిపోయిందా! ఆవేశం మాయమై ఆవేదన తోసుకొస్తుంది. కడుపుల పేగుల్ని తెడ్డుతో కలెబెట్టినట్టనిపించింది.

శవాన్ని ట్రాక్టర్ కెక్కించిండ్రు. గాలయ్య నెత్తీనోరు కొట్టుకుంటూ ట్రాక్టర్ దగ్గరి కురికిండు. ట్రాక్టర్ వెళ్లిపోయింది. గాలయ్య అంగలార్పులు ఆకాశాన్నంటుతున్నై. నేలమీద పడి బొర్లుతున్నడు...



మన తెలంగాణల బతుకుదెరువుంటే మనం గిక్కడికెందు కొస్తుంటిమి? మన నాయకులు పదవులు కాపాడుకుంటున్నరు. మాకన్యాయం జరుగుతుందని పెదవి విప్పి అడగరు. మాగ్గూడా కొత్త ప్రాజెక్టులు, కొత్త రైలుమార్గాలు కావాలని అడగరు పిరికి సన్నాసులు

కడుపుల డోలు వాయించినట్లైంది డాకయ్యకు. పొత్తికడుపుల నుండి దుఃఖం తన్నుకొస్తుంది. కంటినీరు ధారలు సాగింది.

"డాకులూ... ఏడుస్తున్నవా!" వెనుకనుండి భుజమ్మీదో చెయ్యి వడింది. తిరిగి చూస్తే... వెంకటేశ్వర్లు.

"చూసినవా బావా! గాలయ్య పెండ్లాం చచ్చిపోయింది... వెంకటేశ్వర్లు ఛాతీమీద వాలి బోర్మన్నాడు.

"అతుకుల బతుకుల గతి గంతేరా డాకులూ! పొద్దంతా నువ్వు పనిమీదుంటవు కాబట్టి నీకు కనబడవు. ఇసొంటి యెన్నో నేను జూస్తున్న. పాత రైలుడబ్బల పులిసిపోయిన పీనుగులు, రోగాలొచ్చి మూల్గిమూల్గి పైపులల్లనే ప్రాణాలొదిలిన గరీబులు... ఇక్కడ మనుషులు పందులకంటే హీనమనుకో..." వెంకటేశ్వర్ల అశ్రుబిందువులు డాకయ్య తలను తడిపేస్తున్నై. అలవోకగా డాకయ్య భుజాలు పట్టి లేపి "ఇసొంటియి ఇంకెన్ని చూడాల్నో... పా!" వెనక్కు తిప్పి గుడిశె వైపు నడిపించుకొస్తున్నడు.

"మన తెలంగాణల బతుకుదెరువుంటే మనం గిక్కడికెందు కొస్తుంటిమి? మన నాయకులు పదవులు కాపాడుకుంటున్నరు. మాకన్యాయం జరుగుతుందని పెదవి విప్పి అడగరు. మాగ్గూడా కొత్త ప్రాజెక్టులు, కొత్త రైలుమార్గాలు కావాలని అడగరు పిరికి సన్నాసులు. మా పంటభూములెండుకపోతున్నయని, రైతులు, కూలీలు, పనోళ్లు ఆకలిచావులు ఛస్తున్నరని గద్బుడు జెయ్యరు. వెనకబడ్డ జిల్లాల సంగతి పట్టించుకోక ముందున్న జిల్లాలు ఇంకా ముందుకుపోతున్నై... బతుకుదెరువు కోసం బొంబాయికొస్తే, గీగతి మనకుగింతే రాసుంది డాకులూ! నువ్వు ఇవన్నీ మనసుల పెట్టుకోకు..." గుడిశె తాళం తీయించి వెళ్లిపోయిండు. డాకయ్య మనిషిగా గుడిశెలో కూచున్నడుగాని మనసెక్కడో ఉంది.

నేను చచ్చిపోతే... నా గతిగంతే!... కడుపుల పేగుల్ని కరకరకోసినట్లైంది. ఏదో భయం. పాపం గాలయ్య! ఎక్కడ పుట్టింటో, ఎట్ల పెరిగిండో! ఆమె ఎక్కడ పుట్టిందో, ఎట్ల పెరిగిందో... వాళ్లిద్దరెట్ల కలుసుకున్నరో! నాకిక్కడెవలున్నరు? ఊర్లె ముగ్గురున్నరు. అమ్మకు ముందే దగ్గు దమ్ము. మందులు తింటుందో లేదో! నేను నెలనెలా వంపిన మనియార్డరు పైసలు గాసానికి, తమ్ముని చదువుకు సరిపోతున్నయో లేదో! ఊహుం! ఇక్కడ ఉండొద్దిహ. ఇదే రెక్కల కష్టం హైదరాబాదుల చేసుకుంటె దొరకదా! జల్ది ఇంటికి పోవాలె. సిగపూవు ఇడిపించాలె. పట్టాగొలుసుల గజ్జెల చప్పుడు ఆలోచనల కంతరాయం కల్పించింది.

"ఏంది డాకయ్యా!" తియ్యని గొంతు. "చీకట్ల కూకుండి చిందులాట గిరాస్తున్నవా?" ఇందిర లైటు వేసింది.

చీకటితోపాటు భయంగూడా పారిపోయింది. గుడిశె నిండా వెలుగు పరుచుకుంది. గులాబిరంగు పరికిణీ, అదేరంగు జాకెట్, అందాలను దాచేస్తున్న తెల్లని వోణీ, ఛాతీమీదికొచ్చిన నల్లని జడ... ఆహా... దేవకన్యలాగుంది. మనసు లేచొచ్చింది.

"ఏంది డాకయ్యా... గట్టున్నవేందీ?" నుదురుమీద మెత్తని వేళ్లు... గదవబట్టి పైకి లేపింది. ఆత్మీయులకోసం అలమటిస్తున్న హృదయం అమాంతం పొంగుకొచ్చింది, ఇందిర చేతులందుకుని, అరచేతుల్ని చెంపలకు రాసుకున్నడు. గాలయ్య భార్య చావు... అంతా చెప్పేసిండు... ఇంగ నేనిక్కడుండను ఇందిరా!" మనసులోని మాట బయటికి తన్నుకొచ్చింది.

"గట్లంటె ఎట్లనయ్యా?" బుగ్గలు నిమిరింది.

తాను వచ్చినప్పట్నుంచి ఒక్కో చెమటబిందువును ఒక్కో రూపాయగా మార్చిన సంగతులన్నీ పూసగుచ్చినట్టు చెప్పేసిండు. ఇందిర కనుబొమలు గమ్మత్తుగా ముడేసుకున్నై. మోకాళ్లమీద కూచుండి కొనకొంగుతో కళ్లు అద్దింది.


"మా అమ్మమ్మగ్గూడా సిగపూవుంది. ఆ పెండ్లయినంక దాన్ని నాకిస్తనన్నది" చిలిపిగా చూసి నవ్వింది. "సరేగాని... మీ అమ్మ సిగపూవు విడిపించేందుకూ, చెల్లె పెండ్లికోసం ఎన్ని రూపాయలు కూడబెట్టినవ్?"

"లెక్కపెట్టి చూద్దామా!" ఉత్సాహమొచ్చింది.

"ఆ... తియ్యి. చూద్దాం" చెయ్యిబట్టి లేపింది.

ఉత్సాహం ఉత్తేజపరిచింది. అనుకోకుండా చేతులు ఇందిర నడుమును చుట్టేసినై. సర్రున వేడెక్కింది ఒళ్లు.

"హమ్మో... గిదేందీ?" గబుక్కున విడిపించుకుని దబుక్కున తలుపేసి వచ్చింది. భుజాలమీద చేతులేసి




అడిగింది-

"పైసలు లెక్కపెడ్దామా, పరాచికాలాడుకుందామా?" కాటిక కనురెప్పలు ఎగిరిపడినై. ఎర్రని పెదాలమీద తెల్లని చిరునవ్వు... లైటు వెలుతురు పరావర్తనం చెందుతోంది.

మూలకున్న ట్రంకుపెట్టె తాళం విప్పుకుంది. పెట్టె తలుపు తెరుచుకుంది. నాలుగు చేతులు నోట్లను మడత పెట్టినై. అంతా కలిపి ఐదువేల పైననే ఉంది.

"మనం మీ ఊరికిపోదాం. పెండ్లి జేసుకుందాం..." కళ్లలోకి చూస్తూ చెప్పుకుపోతుంది ఇందిర. "ముందు మీ చెల్లె పెండ్లి జేద్దాం. హైదరాబాదు పోదాం. నువ్వు కూలివంజెయ్యి. నేనింకేదన్నా పంజూసుకుంట. మీ అమ్మను మంచి డాక్టరుకు చూపెడ్తాం..." నోట్లు పెట్టెలో ఉంచి మూసేసింది. డాకయ్య తాళమేసిండు.

ఇందిర ఎంత మంచిదో!

"నువ్వు నాతోని వస్తే మా అమ్మ మురిసిపోతది. చుక్కసొంటి పెండ్లాన్ని తెచ్చుకున్ననని నన్ను మెచ్చుకుంటుంది" తాళం లాగి చూసిండు.

"దీంట్లనుంచి సిగపూవు విడిపించుకుని మీ చెల్లి పెండ్లి చెయ్యచ్చు" ముక్కుపట్టి చిలిపిగా లాగి వదిలేసింది.

ఆహా... ఎంత హాయిగుందో!

"ఇందిరా! ఇప్పుడు నువ్విక్కడనే ఉంటే... మీ అమ్మానాన్నలు ఎదిరిచూసి ఆగమైపోతరా?"

"ఊహుఁ! మా అమ్మానాన్నలు చుట్టాల మార్గం బోయింద్రు. ఒక్కదాన్నే... ఇంట్ల భయమైతది. ఇప్పుడిక్కడనే ఉంటా..." వోణీ కొంగును చూపుడువేలుకు ముడేసుకుంటుంది. కోతికి కొబ్బెరి దొరికినట్టుంది.

"నరే... ఉండు గాపేలాలిటుతే. బుక్కుదాం" హుషారుగా చాప పరిచి కూచున్నడు.

"రెండు మూడురోజులల్ల ఊరికి వోతంగదా! గా బియ్యమేం జేస్కుంటవ్? ఇప్పుడు అన్నం వండి ఉల్లి గడ్డల పులుసు చేస్తానయ్యా?" పెద్దపెద్ద కళ్లు తోలుబొమ్మలోలె కదిలినై.

గాజుల వంట రుచి చూడక గన్ని రోజులైంది. ప్రాణం లేచొచ్చింది.

ఇటు వంట... అటు ఏవేవో ముచ్చట్లు. పులుసు తిరగబోస్తుంటె ముక్కుపుటాలెగిరిపడినై. ఆవురావురుమంటుంది ప్రాణం.

అల్లరి చూపులు. వింతచేష్టలు... ఒకే పల్లెములో ఇద్దరి భోజనం... తృప్తిగా ఉంది. చాపమీద చెరోవైపు తిరిగి పడుకున్నారు. వేడెక్కుతున్న శరీరం... బలపడుతున్న కోరిక... మరో లోకంలో ఉన్నట్లుంది డాకయ్యకు. నిద్రరానంటుంది.

"డాకయ్యా!" తియ్యని పిలుపు. ఇటువైపు తిరిగింది ఇందిర.

"ఇందిరా!" ఆతృత అటే తిప్పింది.

చూపులు కలుసుకుని... బాణాలు విసురుకుంటున్నై.

"నిద్రొస్తలేదుగదా!" అరచేత్తో చెంపమీద రాసింది. "రేపు నువ్వు మన పెండ్లి గురించి మా వెంకటేశ్వర్లు అన్ననడుగు. మా అన్న చాన మంచోడు. కాదనడు. అన్న కాదంటే అమ్మానాన్నలు కాదనరు."

గుండెలెగిరెగిరి పడుతున్నై. వేడి ఉచ్ఛ్వాసనిశ్వాసలు ఒరునుకుంటున్నై. "నరే ఇందిరా!" జరిగి దగ్గరి కొచ్చిండు. ఇందిర నడుమ్మీద చెయ్యిపడింది. నరాలు జివ్వుమన్నై. "వెంకటేశ్వర్లు బావ తిరుపతి వెంకటేశుడు. అందరికి సాయంజేస్తడు" ఇంకో చెయ్యి చెంపమీద కొచ్చింది.

లైటు వెలుగుతూనే వుంది. పొడగాటి జడ ఎత్తైన గుండెలమీదుంది. మెరిసే నుదుటిమీద నల్లని కురులు

*మూలకు ట్రంకుపెట్టెలేదు. గుండె ఝల్లుమంది. గుడిశె అంతా వెతికిండు. కనిపించలేదు. "ఇందిరా...ఇందిరా!" గుడిశె దద్దరిల్లింది. నల్లా దగ్గర, అటూ-ఇటూ ఎటుచూసినా ఇందిర జాడలేదు.*

ఆడుకుంటున్నై. చెయ్యి బిగుసుకుంటుంది.

"అమ్మో... గిదేందీ?" బుంగమూతి పెట్టింది. సున్నితంగా చేతులు పక్కకు జరిపింది. గిదంతా పెండ్లి అయినంకగదా!" చటుక్కున అటు తిరిగింది.

"ఓర్నియవ్వ..." వాగుకు వరదలొచ్చినట్టు కోర్కె కట్టలు తెంచుకుంది. తనను తాను అదుపులో పెట్టడం అసాధ్యమైంది. "మనం ఇక్కడనే పెండ్లి జేనుకుని ఊరికిపోదాం. రేపు మా గుత్తేదారుకు జెప్పి లెక్కలు చేయించి పైసలు తెచ్చుకుంట. రెండుమూడు రోజులల్ల పెండ్లిజేసుకొని పోదాం" వేగలేని శరీరం, ఆగలేని చేతులు నడుమును నాగుపాముల్లా చుట్టేసినై.

"సరే... ఇంగ ఇడిసిపెట్టు... నిద్రపో..."

"ఏంగాదులే ఇందిరా! ఎట్లైనా ఆలుమొగలమేగదా!" కోర వయసు, కొంటె మనసు. దోరమాగిన మామిడిపండు దోసిట్ల ఉన్నది. చేతులున్న పండు మూతి కందకంటే ఊకుంటుందా! తానే లేచి లైటార్పి వచ్చేసిండు.

** ** **

నగం తెరుచుకున్న తలుపు సందునుండి చొచ్చుకొచ్చిన సూర్యకిరణాలు డాకయ్య ఒంటిమీద వాలినై. చెంపలమీది కొచ్చినై. కళ్లు తెరిచేసరికి కరకర పొద్దెక్కింది. అయ్యో... ఈ పాటికి పనికిపోయేదుండె...! ఇందిర పక్కనలేదు.

నీళ్లకోనం నల్లా దగ్గరికి వోయిందేమో! లేచి చూసిండు. ప్లాస్టిక్ బిందె, బకెట్టు, జగ్గు అక్కడే ఉన్నై. కడగని వంటగిన్నెలు పొయ్యిమీదున్నై. మూలకు ట్రంకుపెట్టెలేదు. గుండె ఝల్లుమంది. గుడిశె అంతా వెతికిండు. కనిపించలేదు.

"ఇందిరా...ఇందిరా!" గుడిశె దద్దరిల్లింది.

నల్లా దగ్గర, అటూ-ఇటూ ఎటుచూసినా ఇందిర జాడలేదు.

ఆందోళన, భయం, ఆవేశం... అయోమయం, కాళ్లు శ్రీవెంకటేశ్వర పాన్‌షాపుకు పరుగులు దీసినై.

షాపు చుట్టూ గిరాకులు, నడుమ వెంకటేశ్వర్లు.

"పనికి పోతున్నవా డాకులూ!" తమలపాకుల సున్నం రాస్తూ పలుకరించిండు.

"మ్మీ... మీ... చెచె చెల్లె" గొంతు సరిగా పెగలనంటుంది. "ఇ...య్యిక్కడికొచ్చిందా? మీ ఇంట్ల ఉందా?"

"మా చెల్లె ఎవలూ? నాకు చెల్లెల్లు ఎవ్వలూ లేరు. పరాష్కమాడుతున్నవా పిల్లగా!" నవ్వుతూ పాన్ కట్టియిచ్చేసిండు.

"అయ్యో... దెశకు మసికబొంత... పరాష్కమా? గదే... గా ఇందిర... మీ చిన్నాయిన బిడ్డ బావా..." దమ్ము వచ్చేస్తుంది.

గిరాకులు వెళ్లిపోయింద్రు.

"నాకు చిన్నాయన, పెదనాయినలుంటే బొంబాయికెందుకొస్తా? నీకేమైంది డాకులూ? గంత దమ్ముదీస్తున్నవు. పరేషాన్‌గున్నవా?" గుడ్డతో తలుపుల అద్దాలు తుడుస్తున్నడు.

"అయ్యో బావా... గదే... ఆ ఇందిర బావా! నీకు చెల్లెలుకాదా?" కోపమొచ్చింది.

"నీ యవ్వ... నా చెల్లెలంటవు. ఎవతో ఇందిర అంటవు... నీకేమన్నా దయ్యం బట్టినాదిరా! సప్పుడు జెయ్యక పనికివో!" గట్టిగా మందలించిండు. గప్పుడే గిరాకులొచ్చింద్రు.

"జల్దీ... మీఠాపాన్ దో భాయ్!"

"జెప్పున ఓ బీడీకట్టి ఇయ్యన్నా!"

డాకయ్య తలలో ధాంధామ్మని తుపాకులు పేలుతున్నై. నెత్తికొట్టుకుని... రాత్రి సంగతంతా చెప్పేసిండు. అంతావిని నోరు తెరిచిండు వెంకటేశ్వర్లు. వచ్చిన గిరాకులు విని విచిత్రంగా చూస్తున్నరు.

"అయ్యో డాకులూ... అన్యాయమైపోయినవురా!" వెంకటేశ్వర్లు నెత్తికొట్టుకున్నడు. ఆ ముండ ఎవలో నిన్నెక్కడ వట్టిందో! బద్మాష్ ముండలు... ఏషాలేసి మోసంజేస్తరు. అంగట్ల అవ్వా అంటే ఎవనికి పుట్టినవ్ బిడ్డా అన్నట్టైందిరా..."

డాకయ్య నవనాడుల్లోంచి దుఃఖం ఎగదన్నుకొస్తుంది. గుండెలు బాదుకుంటున్నడు. జుట్టు పీక్కుంటున్నాడు.

"అయ్యో బావా! నేనేం జెయ్యాలె బావా! అమ్మ సిగపూవు ఎట్లా ఇడిపియ్యాలే... చెల్లె పెండ్లెట్ల జెయ్యాలే... అయ్యో..." అరుపులు, అంగలార్పులు... జనారణ్యంలో డాకయ్య ఒంటరిగాడు. ●